# పల్లె పడుచు

-పి. రమేష్

కోమల ఇంటి గుమ్మంలో అడుగుపెట్టిందో లేదో వెనుకనుండి వచ్చి ఎవరో కళ్ళు మూశారు. ఎవరో చెప్పుకో అన్నట్లు.

ఆ స్పర్శ పురుషులదేనని నిర్ధారించుకొన్న కోమల, ఎవరో కాదు మా మేనబావే అయ్యుంటాడు అని మనసులో అనుకొని...



"ఎప్పుడొచ్చావ్ శ్రీకాంత్" అని ప్రశ్నించింది.

అయినా ప్రయోజనం లేదు. చేతులు తీస్తే ఒట్టు. ఎంతగా ఆలోచించినా ఎవరై ఉంటారో అంతుపట్టక ఓడిపోయానని ఒప్పేసుకుంటేగానీ బందీగా ఉన్న కళ్ళు బయటపళ్ళేదు. అంతవరకు చీకట్లు కమ్మిన కళ్ళను నలుస్తూ వెనుదిరిగి చూసింది. ఎవరో కాదు వాళ్ళ తాతయ్య.

తాతయ్యపై చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ "ఏంటి తాతయ్యా? ఎవరో క్రొత్త మనుషుల్లాగా" అంటూ అతని బుగ్గలు నులిమింది.

"అవునమ్మా నీవు ఎవరని భ్రమ పడతావో చూద్దామనుకొన్నాను" అది నిజమైంది.

'అవునూ! ఈ అబ్బాయి ఇంకా రాలేదేంటి' అని ఎదురు చూస్తున్నట్లు బయటికి చూస్తోన్న తాతయ్యతో

"పట్నం వాసులు కదా ఎన్నో పనులుంటాయి. పల్లెల్లో తిరగాలన్నా వాళ్ళకెంతో ఆనందం. వచ్చేవాళ్ళు ఎలాగూ వస్తారు. నీవుపద" అంటూ తాతయ్యను లోపలికి తీసుకెళ్ళింది కోమల.

★ ★ ★

రాత్రి పదిగంటలు. ఎన్ని రకాల ప్రయత్నించినా నిద్రపట్టలేదు. ఎందుకు ఆమె మనసులో ఏదో మనోవేదన. అదే తన బావ రాలేదేంటని.

టక్... టక్... టక్...

బయట తలుపు శబ్దం. ఆ శబ్దాన్ని గ్రహించిన కోమలకు అంతుపట్టని ఆనందం. తన బావ వచ్చాడేమోనని మరోవిధంగా అనుమానం. ఇంతరాత్రివేళ దొంగోడే కావచ్చని భయం. తలుపు అలాగే తడుతూనే ఉన్నారు.

కోమల మనస్సులో భయాందోళనలు మొదలయ్యాయి. తాతయ్య, బామ్మలను లేపాలని చూసింది కానీ వచ్చింది దొంగో, దొరో, తెలీదు.

దొంగైతే మా ముగ్గురి పని ఫట్ అని మనసులో అనుకొని ఏమీ ఎరగనట్లు పడుకొని భయపడుతూనే ఉంది.

కొంతసేపటికి కోడికూత. ఆ కూతను గ్రహించిన కోమలకు ఎంతో ఆనందం కలిగింది. మా కోడిపుంజు సరిగ్గా నాలుగున్నరకే వెనకాముందు కాకుండా కూస్తుంది. వచ్చింది మా బావయ్యేనని మనస్సు లో నిర్ధారించుకొని పరుగు పరుగున వెళ్ళి ఆసక్తిగా గొళ్ళెం తీసింది.

"ఇవిగోనమ్మా పాలు. నేడు దీపావళి కదమ్మా. పట్నం వెళ్ళి మా కూతురు అల్లుళ్ళకి బట్టలు కొనాలి. అందుకే నమ్మా ఈ మసక రాత్రి వచ్చాను." అని పాల బిందెను చేతికందించింది పాల మనిషి.

మౌనంగా తీసుకొని వెనుదిరిగి గొళ్ళెం పెట్టేసి బిందెను ఇంట్లోకి తీసుకెళ్తోంది కోమల.

ఆ వెంటనే టక్... టక్... టక్...

బిందెను క్రిందకు దించి గొళ్ళెం తీయడానికి వస్తోన్న కోమల "ఈ పాలముదనష్టి బట్టలు కొనడానికి డబ్బుల్లేవు. డబ్బులేమైనా ఇస్తారమ్మా" అని అడుగుతుందేమోనని అని మనసులో అనుకొని పామును చూసిన ముంగీసలా ఎంతో కోపాన్నీ, ఆవేశాన్నీ ప్రదర్శిస్తూ గొళ్ళెం తీసింది. తీరాచూస్తే మావయ్యా, అత్తయ్యా, బావ శ్రీకాంత్.

వచ్చిన వాళ్ళతో మాటల్లో పడిపోయారు ఇద్దరు ముసలివాళ్ళు. వాళ్ళకు ప్రక్కన కూర్చుని వారి సంభాషణలు వింటూ మధ్య మధ్యన ఓరగా చూసీ చూడనట్లు తన బావను చూడసాగింది. కోమల ఎన్నిసార్లు చూసినా అతడి ముఖాన ఒక్క చిర్నవ్వు కూడా కనిపించలేదు ఆమెకి.

"పోనీలే పట్నపోళ్ళుకదా పెళ్ళి విషయాలు వింటున్నాడు" అనుకొని సరిపెట్టుకుంది తన మనసును.

సాయంత్రం ఆరు గంటలు. దీపావళి పండుగ కదా! ఒక్కో గుమ్మం ముందూ, వాకిళ్ళలో క్రొవ్వొత్తులనూ, చిన్న చిన్న దీపాలనూ వెలిగించడం ప్రారంభమైంది.

ఆ పరిసరాలను చూస్తోన్న శ్రీకాంత్ ఎంతో ఆనందించాడు. ఇది మా పట్నంలో మామూలేనని తర్వాత సరిపెట్టుకున్నాడు.

టపాసులు కాల్చుతున్నారు. ఊరంతా వెలుగు. ఏదో మారుమూల గ్రామం. ఆనాడు పల్లెసీమకు ఉన్న కళ మరేపెద్ద నగరాల్లోనూ ఉండదు.

టపాసులు కాలుస్తున్నారు. శ్రీకాంత్‌ను ఆటపట్టించాలన్న ఉద్దేశంతో కోమల టపాసులను శ్రీకాంత్ దగ్గర పడేసింది. శ్రీకాంత్ జంకలేదు సరికదా కోమలకి సభ్యత లేదని అవమానించాడు. మందలించాడు. అయినా కోమల పట్టించుకోలేదు.

శ్రీకాంత్ ఆవేశంగా "ఛీ చదువూ సంధ్యాలేదు! ఏదో అమ్మా నాన్నలను కాదనలేక పల్లెకు వచ్చాను గానీ ఛీ నాన్సెన్స్."

ఎక్కడి వాళ్ళక్కడే బిత్తర పోయారు.

శ్రీకాంత్ తల్లికి కోపం వచ్చింది. "ఏంట్రా ఏదో మేన బావవనీ ఆ పిల్ల" తల్లి మాట పూర్తికాకుండానే "ఒద్దమ్మా నాకంతా తెలుసు. మేనరికం అనే సాకుతో ఈ పల్లెపిల్లని నాకంటగట్టాలని చూస్తున్నారు" అన్నాడు శ్రీకాంత్.

అప్పటికప్పుడే వీధినిండా జనం పోగయ్యారు. ఎంతైన పల్లెకదా. కొన్ని క్షణాల్లోనే ఆమడదూరం పాకిపోతుంది సమాచారం. శ్రీకాంత్ ఒక్కడే రాత్రని చూడకుండా తన దారిపట్టాడు.

మరుసటి రోజు ముసలి వాళ్ళకు క్షమాపణ కోరి శ్రీకాంత్ తల్లిదండ్రులు పట్నం బయలుదేరారు. కూతురూ, అల్లుడూ వెళ్తున్నా ఏమీ అనలేకపోయారు ముసలి వాళ్ళు.

ఆశ అడియాశయైందని మానసికంగా బాధపడుతోన్న కోమలకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఏదో ఏదో సాధించి హేళన చేసిన వాళ్ళకి గుణపాఠం చెప్పాలన్న ఆలోచనలు ఆమె మదిలో మెదలసాగాయి. ఆ తర్వాత ఓ నిర్ణయాని కొచ్చింది.

రాత్రి బడిలో చేరి ఎంతో పట్టుదలతో అక్షరాలు నేర్చింది.

లక్ష్మీదేవిలాంటి ముఖవర్చస్సు సరస్వతీదేవి అగ్రహం తోడైంది.

నాలుగక్షరాలు నేర్చాను కదాని సరిపెట్టుకోలేక ఏదో చేయాలన్న ఆరాటంతో పట్నం వెళ్ళి మహిళా మండలి సంస్థలో సభ్యురాలై. ఎందరో ప్రజలకు తనవంతు చైతన్యాన్ని అందించి వాళ్ళ సుఖజీవ నానికి మార్గదర్శకులరాలైంది.

కోమల తెలివి తేటలను తెలుసుకొన్న శ్రీకాంత్ గుండె జల్లుమని డబ్బు ఉందన్న అహంకారంతో, పట్నవాసులమన్న బడాయితో కోమలను దూషించి ఎంతో పొరపాటు చేశానని కోమలవద్దకు వచ్చి క్షమాపణ కోరాడు. కోమల పట్టించుకోలేదు నవ్వూరుకుంది.

పట్టణవాసుల కన్నా, పల్లెవాసులకు ఎదుటివారిని అర్థం చేసుకునే మనస్తత్వం ఎక్కువని మాటలురాని మూగమనిషిని వివాహమాడి నిరూపించింది కోమల.

పి. రమేష్,
ఇంటి. నెం. 1-1-53/3, శాస్త్రి నగర్,
ఆర్మూర్ - 503 224.




కెంచు చిన్నన్న, చిన్నమెట్‌పల్లి - 505 453, కోరుట్ల (మండలం), కరీంనగర్(జిల్లా)